# పుత్రోత్సాహం

కన్నీరు కారుస్తున్న తల్లిలా వుంది ప్రకృతి. మబ్బులు కమ్ముకుంటున్నాయి. దారి సరిగా కనపడటం లేదు.

తుప్పర ప్రారంభమైంది.

అయినా, యిల్లువదలి బయలుదేరిన శాయి వెళ్ళుతూనే వున్నాడు. పోగా పోగా రైలు పట్టాలు వచ్చాయి. వాటి వెంట వెళ్ళాడు. స్టేషన్ వచ్చింది. ప్లాట్‌ఫారం మీద కూర్చున్నాడు.

మనస్సు గతంలోకి వెళ్ళింది!...

ఆ రోజు!

అందరూ తనను అదృష్టవంతుడన్నారు. ఎంతో ఆస్తి వచ్చిందన్నారు.


ముగ్గురు ఆడపిల్లల తరువాత ముగ్గురు మగపిల్లలలో రెండవవాడు శాయి. తలిదండ్రులు కడుపులు మాడ్చుకొని ఎలాగో పిల్లలను బ్రతికించుకొంటూ వస్తున్నారు.

"తిండికీ బట్టకూ లోపం లేకుండా యింత ఆస్తి వుంది. మా కడుపున పుట్టిన వాళ్ళల్లో నీవైనా సుఖపడు తండ్రీ!" అని తల్లి యిక మాట్లాడలేకపోయింది.

"సరే అమ్మా" అని శాయి గాద్గదికంగా అన్నాడు.

"మా తండ్రికి ఎంత గ్రహింపూ!" అంటూ దగ్గరకు తీసుకుంది. వెచ్చని కన్నీటిబిందువులు తలపై రాలాయి.

తండ్రి ఆర్ద్రనయనాలతో స్పష్టంగా చలిం



చటం తాను చూశాడు.

స్వీకారంనాడు తల్లిదండ్రులు తమ స్థానాల్లో పార్వతమ్మగారిని, విశ్వనాథంగారినీ కూర్చోబెట్టి తనను వాళ్ళచేతుల్లో వుంచారు.

గంభీరమైన మంత్రార్థం తెలియకపోయి నా, లీలగా అంతా తెలిసినట్లే అనిపించింది శాయికి. వాళ్ళనే తమనుగా భావించి, సంతానంలేని వాళ్ళ కొరతను తను తీర్చవలెనని తల్లిదండ్రుల కోరిక.

ఒక ఉదయం దత్తు తల్లి, తండ్రి తనను వెంటతీసుకొని బయలుదేరారు. వాళ్ళ యిద్దరి మధ్య బండిలో తాను కూర్చున్నాడు. పండు వంటి ముత్తయిదును బండికి ఎదురు రమ్మని "యిక సాగనీ రామన్నా!" అన్నారు బండివాణ్ణి.

ఎద్దుల మెడల గంటలు, మువ్వలు హొయ్యారంగా మ్రోగి బండి కదిలింది. అమ్మా నాన్నా కొంతదూరం బండితో వచ్చి కన్నీటితో భారంగా ఆగిపోయారు.

బండిలోంచి దుమికి అమ్మా నాన్నా దగ్గరికి పరిగెత్తి "నేను వాళ్ళతో వెళ్ళను. మీతోనే వుంటాను. వాళ్ల ఆస్తీ వద్దు. ఏమీ వద్దు" అనాలనుకున్నాడు. కాని, "మా తండ్రికి ఎంత గ్రహింపూ!" అన్న అమ్మమాటలు జ్ఞాపకానికి వచ్చి కదలకుండా కూర్చున్నాడు.

బండి మలుపు తిరిగి ఊరుదాటి చేల మధ్యగా పోతోంది. వేణుగోపాలస్వామి వారి ఆలయం, ధ్వజస్తంభం, ఆంజనేయస్వామివారి మందిరం పక్కనే వున్న రోజూ తాను ఈతకొట్టే దిగుడుబావి, ఒక్కొక్కటే కనపడి కదిపిమాయమై పోతున్నాయి.

బండి చక్రాలకింద గండ్రయిసుక చప్పుడవుతోంది, ఎండిపోయిన వాగులోంచి పోతోంది బండి – ఆ వాగులోని తియ్యని నీటి చెలమలు జ్ఞాపకానికి వచ్చాయి.

తానూ, తన స్నేహితులూ తిరిగి ఆడుకున్న ఆ చేలు, దూరంగా కనబడుతున్న ఆ కొండ గుట్టలు!

అమ్మా నాన్నా సరే సరి – ఆ వాతావరణం, ఆ ఆలయం, మంటపం, దిగుడుబావి, మందిరం, కొండలు, వాగు, చేలు అన్నీ ఆత్మీయమైనవేనని తెలిసివచ్చి దుఃఖం కొండలు కొండలుగా ముంచుకొచ్చింది.

ఈ రోజో!

దీపాలుపెట్టి కొంచెంసేపు అయింది. "శాయీ" అని పిల్చారు విశ్వనాథంగారు.

శాయి వచ్చాడు.

"విను" అని వ్రాసి తెచ్చిన చిత్తుప్రతిని చదివి వినిపించారు. పాతికవేల రూపాయలు తీసికొని "కొడుకు" అన్న సంబంధాన్ని వదులుకొంటున్నట్లు సారాంశం.

అతని వొళ్లు ఝల్లుమన్నది. కన్నీరు ఆగలేదు.

ఆనాడు తలిదండ్రుల హృదయాల్లో పెద్ద పెద్ద అలలులేచి విరుచుకుపడ్డప్పటి ఘోష ఈనాడు అతని చెవులను బద్దలు చేయసాగింది.

ఇంతలో రైలు వచ్చి అతని పూర్వ స్మృతికి భంగం కలిగించింది. రైలు ఆగింది. రైలులో కూర్చున్నాడు. కదిలిపోయింది. పోతున్నది ఎక్కడికో, ఎందుకో అతను ఆలోచించుకోలేదు.

* * *

**చక్రవర్తి రంగస్వామి**

ముద్దులొలికే చిన్న పిల్లల ముఖాలు చూచినా, వచ్చీరాని వాళ్ల తియ్యనిమాటలు విన్నా తనకాభాగ్యం లేనందుకు తపించిపో యేది పార్వతమ్మగారు. చిన్ని కాళ్ళూ చేతులూ యాంత్రికంగా కదిలించడం మాత్రమే తెలిసిన బిడ్డ, తల్లిని చేసినప్పుడల్లా పొందే ఆనందో ద్వేగం ఆమెను తీరని ఆలోచనల్లో ముంచేది.

నిండు పొదుగుతో పొలంనుంచి పరుగెత్తు కుంటూ వచ్చిన తల్లి దగ్గరకు పోవడంకోసం తొందరపడే లేగదూడ, సుఖంగా సగంకళ్లు మూసికొని, పాలు తాగుతూ అల్లరిచేసే కూన లను తృప్తిగా చూసుకుంటూ మాతృత్వ మాధు ర్యాన్ని అనుభవించే తల్లి పిల్లీ, ఎటు చూసినా మాతృప్రేమతో, కలకల్లాడే యీ విశాలప్ర పంచం ఆమె కొరతను మరింత అగాధంగా చూపెట్టేది.

విశ్వనాధంగారుమాత్రం ఆ కొరత వున్నట్లు ఎప్పుడూ కనబడలేదు.

"ఇంత సంపాదించుకుంటున్నందుకు ఒక్క నలుసు ఏర్పడివుంటే యెంత బాగుండేది!"అని ఎవరైనా అన్నప్పుడు విశ్వనాధంగారు శుష్కంగా నవ్వి "ఆ నలుసులు ఏర్పడ్డ వాళ్ళను ఒక్కొక్కరి ని చూస్తుంటే లేనివాళ్ళపనే నయం అనిపి స్తోంది" అనేవారు.

పార్వతమ్మగారికి భర్తధోరణి కష్టంగా వుండి "వారు పైకి అలాగే అంటారు లెండి" అనేది - ఎవరైనా తన భర్తకు హృదయం లేదను కొనిపోతారేమోనని ఆమె భయం.

"కొరత ఎందుకుండదులెండి! పైకి ఏదో"

"ఎందుకేమిటి కొరత?"

"పగలంతా ఆఫీసులో కాలం గడిపే వాళ్ళ కు ఏ కొరతుంటే మాత్రం ఏం పడుతుంది

## పాతబంగారం

శ్రీ చక్రవర్తి రంగస్వామిగారు పాతతరం రచయితల కోవకు చెందినవారు. 1917 జూలై పదిహేడవ తేదీన జన్మించారు. వీరి బాల్యం వేటపాలెం సమీపంలోని దరిసి అగ్రహారంలో గడిచింది. హైదరాబాద్‌లో స్థిరపడి జర్నలిజం వృత్తిగా స్వీకరించారు. వీరు కేవలం కథారచయిత మాత్రమే కాక మంచి కవి, నవలారచయిత కూడా. బాలలకు సంబంధించి చక్కని గేయాలు రాసారు.

'నిజమైన మనుషులు', 'చక్రవర్తి కథలు' అనే రెండు కథా సంపుటాలు వెలువరిం చారు. వీరు 'ఆంధ్రభూమి'లో పనిచేశారు.

కుటుంబ సభ్యుల మధ్య సిరిసంపదల కన్నా మమతానుబంధాలు, మానవత్వపు విలువలు మిన్న అని తెలియచెప్పే 'పుత్రేషణ' ఈ నెల కథాకేళి 'పాతబంగారం' శీర్షికన అందిస్తున్న మరో ఆణిముత్యం.

ఈ కథ 1951లో ఆంధ్రపత్రిక దీపా వళి సంచికలో ప్రచురించబడింది.

మనస్సుకు?"

"కాదు. కొరత వుందని లక్షసార్లు అను కుంటే వచ్చేదేమిటి?"

"వచ్చేదేమీలేదు, కానీ అయినవాళ్లల్లో బుద్ధిమంతుణ్ణి చూసి దగ్గరికి తీసుకొని ముద్దూ ముచ్చటా తీర్చుకోవచ్చు. ఒకడికి ఆధారం చూపినట్టూ అవుతుంది, వంశమూ నిల్చినట్లవు తుంది."

పార్వతమ్మగారి కళ్ళలో ఆశ మెరిసేది.

విశ్వనాధంగారు మౌనం వహించేవారు.

ఉద్యోగం చేసి యిప్పుడిప్పుడే రిటైరైన విశ్వ నాథం గారికి ఎంతో డబ్బు వచ్చిపడింది.

నెలనెలకు పెద్ద పెన్షన్ దొరుకుతోంది.

కొంతకాలానికి ఎలాగయితేనేం పార్వతమ్మ గారి తపస్సు ఫలించి విశ్వనాధంగారు స్వీకారా నికి అంగీకరించారు.

స్వీకారంనాటినుంచి శాయి పార్వతమ్మ గారిని 'అమ్మా' అనీ, విశ్వనాధంగారిని 'నాన్న గారూ' అనీ పిలుస్తున్నాడు. 'అమ్మా' అని పిల్చి న శాయిని చూసినప్పుడు నిజంగా తన కొడుకే నేమోనన్న భ్రమ పార్వతమ్మ గారికి! 'బాబూ' అని పదిసార్లు పిలిచి కన్నకొడుకును పిలుస్తు న్నప్పటి మధురానుభూతి పొందేది.

అన్నం, కూరలూ వడ్డించి, దగ్గరకూర్చుని నిమిష నిమిషానికీ నెయ్యి వడ్డిస్తూ, "ఇంకా కొంచెం కొంచెం" అంటూ తినిపించేది. ప్రతి చిన్న విషయంలోను ప్రేమ, వాత్సల్యాలు ఆమెలో తొణికిసలాడుతూ వుండేవి.

వాళ్ళతో, వీళ్ళతో "అబ్బాయి" సద్గుణాలను గురించి అదేపనిగా చెప్పేది. తల్లిని కావాలని ఎంతగా తపించిందో అంతగా సంతృప్తిని, ఆనందాన్నీ పొందింది. పెట్టుపోతల్లో, ప్రేమలో తల్లిని మరపించింది. శాయి తన కొడుకు కాదన్న సంగతి ఆమెకు గుర్తు వచ్చేది కాదు.

కోడలు వచ్చింది.

"నువ్వు వుండు, యిలా యివ్వు. ఈ కాస్త పని నేను చూసుకుంటాను. అబ్బాయికి ఏమైనా కావాలేమో కనుక్కో" అంటూ చేతిలోని ప్రతి పనికీ అడ్డుపోయేది.

ఆమె జీవితంలోకి వచ్చిన యీ తియ్యని అనుభవాలు ఆమెను పులకింపజేశాయి. కొడు కూ, కోడలూ ముచ్చట తీరింది కనుక మను మళ్లూ, మనుమరాళ్ళ ముచ్చట తీరటం ఎప్పు డా అని ఎదురుచూడసాగింది.

తన సంతృప్తితో, సంతోషంతో భర్త ఎంత వరకు అనుసరిస్తున్నాడో వెనక్కు తిరిగి చూసు కోడానికి ఆ అవ్యక్తానందంలో ఆమెకు తీరి కేది? తనతోపాటు భర్తకూడా ఆనందాను భూతిని పొందుతున్నట్లే ఆమె నమ్మకం.

మళ్ళీ ఆమె కోరిక నెరవేరింది. ఇంట్లో సూడిదలు, బారసాలు, నామకరణం వైభవంగా జరిగాయి. మనుమనికి ముద్దకుడుములు, అన్నప్రాసన, గడపలు దాటేటప్పుడు గారెలు, అరిశెలు - ప్రతిముచ్చటా జరిపింది.

ఆమె పొందుతున్న ఆనందం విశ్వనాధం గారు పొందటంలేదు. భార్య కోరిక తీర్చటం కోసం దత్తుకు అంగీకరించారు. శాయి తన కన్నకొడుకు కాదు అన్న విషయం ఆయనకు ప్రతిక్షణం జ్ఞాపకంలో వుండేది. తన కష్టార్జి తాన్ని అనుభవించటానికి కృష్ణమూర్తిగారి కొడుకూ, పురుషోత్తం గారి కూతురూ వచ్చార న్న కఠినసత్యం ఆయన కళ్ళముందు వికృత పరిహాసం చేసేది.

పల్లెటూరి యువకుడుగా వచ్చిన శాయి నాగరికతవేపు పురోగమిస్తూ వుండటం విశ్వనాధంగారు పరిశీలనగా చూడటం ప్రారం భించారు. తన జీవితంలో ఎన్నడూ తాను కోర నివి శాయి ఏర్పరచుకొంటున్నాడు. విలువైన దుస్తులు, వాచీ, సైకిలు, పుస్తకాలు, స్నేహి తులు, పత్రికలు,...

ఆయన మనస్సు ఖర్చుకు బాధపడటం మొదలుపెట్టింది.

తన జీవితానికంతకూ మూడే మూడు కోట్లు సరిపోయాయి. ఇంకా ఉపయోగపడు

తూనే వున్నాయి. రోజుకు ఒకరాయి చొప్పున తీస్తే కొండంతదీ తరిగిపోతుంది. సంపాదించినవాడికి కానీ డబ్బువిలువ తెలియదు. ఇంతకూ చివరివరకూ అదుపాజ్ఞలలో వుంటాడని నమ్మకం ఏమిటి?

పార్వతి కన్నీరు తనను యీ స్వీకారానికి అంగీకరింపచేసింది. పార్వతికేమి తెలుసునని? వట్టి పిచ్చిది. ఈ లోకులకెందుకో యితరుల సంగతులు? ఏదో మేలుకోరుతున్నట్లు సలహాలు! తాను స్వయంగా వెనుక ముందులు తరచి చూసుకోడానికి లేకుండా మాటల గారడిలో పడిపోయాడు.

కోడలు తానొక రాణీననుకొంటుంది!

ఎంత పెంచినా ఎవరి కొడుకంటుంది యీ ప్రపంచం? కన్న తల్లిదండ్రుల పేర్లే చెపుతుంది.

వాళ్ళు మండిపోయేది.

పడక కుర్చీలో అరమూత కన్నులతో పవళించి యీ ఆలోచనలతో సతమతమౌతుండేవారు విశ్వనాథంగారు. చివరకు "యీ తెచ్చిపెట్టుకున్న జంజాటాన్ని వదలించుకొంటేగాని నిద్రపట్టేట్టు లేదు" అనుకొని ఆ సాయంత్రంవెళ్లి వకీలుతో సలహాపడి తయారుచేసుకొని వచ్చిన చిత్తుప్రతినే శాయికి ఆ రాత్రి యిల్లు వదిలిపోయే ముందు చదివి వినిపించారు.

అలా వెళ్ళిన శాయి ఆరునెలలు తరువాత ఒకనాటి అర్ధరాత్రివేళ మామగారి తలుపుతట్టాడు. "ఇంత పొద్దుపోయి ఎవరా?" అనుకుంటూ పురుషోత్తంగారు తలుపుతీశారు. ఆయన ఆశ్చర్యానికి అంతులేదు! దుఃఖం, ఆనందం - యీ రెంటితో ఆయన కళ్లు చెమ్మగిల్లాయి.

భార్యను సంతోషంతో వణుకుతున్న గొంతుతో పెద్దగా "శాయి వచ్చాడే" అని కేకవేసి అతని చేయిపట్టుకొని అడుగులు తడబడుతూండగా తీసికెళ్లి కుర్చీలో కూర్చోబెట్టారు.

కనకమ్మగారు సరళను నిద్రలేపింది. సరళ "మీ బావగారు వచ్చారు" అంటూ చెల్లెళ్ళను లేపింది. "నాన్నగారు వచ్చారు" అంటూ కొడుకును లేపింది. అందరి ముఖాల్లో ఆశ్చర్యం, సంతోషం మెరిసిపోయాయి.

సంతోషంవల్ల ఆ రాత్రి ఎవరికీ నిద్రపట్టలేదు. భళ్ళున తెల్లవారేవరకు ఏవోమాటలు. బాబుకూడా చెపుతున్నాడు తండ్రికి.

అందరికంటే తక్కువ మాట్లాడింది సరళ. ఆమె పొందిన ఆనందానికి గంభీరసముద్రమంత లోతు, ఆకాశమంత విస్తీర్ణం, వెన్నెలంత స్వచ్ఛత ఆ యిల్లు క్షణంలో తేరుకొని కలకల్లాడింది.

సూర్యుడు ఉదయించాడు. స్నానాలు, కాఫీలు అయ్యాయి. శాయి పెంపుడు తల్లిదండ్రుల యింటికి వెళ్లాడు. పురుషోత్తం, కనకమ్మగార్లు నవ్వుకున్నారు.

శాయితో విశ్వనాథంగారు ముక్తసరిగా మాట్లాడారు. తరువాత పార్వతమ్మగారి దగ్గర కెళ్లి కూర్చున్నాడు. ఆమెకు కన్నీరు ఆగలేదు. అతనికి కళ్లు చెమ్మగిల్లాయి.

"వెళ్లేముందు నాతో మాటమాత్రం చెప్పకూడదా బాబూ?"

"నాన్నగారికి మేము వుండటం యిష్టం లేదు" యిక మాట్లాడలేక వూరుకున్నాడు.

"నీవలా వెళ్లిపోవటం నాకెంతో దుఃఖాన్ని

1951లో ప్రచురించబడిన ఈ కథకు 'బాపు' గారు బొమ్మలు వేసారు. వాటినే ఇక్కడ ఉపయోగించడం జరిగింది. వారికి మా కృతజ్ఞతలు.

కల్గించింది. నా మనస్సు ఎంత బాధ పడుతోం దో నీకేం తెలుసు బాబూ..."

"నాకు మాత్రం ఎందుకు తెలియదమ్మా?"

ఇద్దరి కంఠాలు దుఃఖంతో నిండి ఉన్నాయి. ఇద్దరూ మాట్లాడలేకపోయారు.

కొంతసేపు నిశ్శబ్దం.

"మళ్ళీ వస్తాను" అంటూ శాయి ఇవతలికి వస్తూండగా విశ్వనాధంగారు పిలిచి "రేపు ఆ కాగితాలు పూర్తిచేద్దాం. పైకం సిద్ధంగా ఉంది" అన్నారు.


శాయి ఏమీ పలకలేదు.

మర్రోజు ఉదయమే శాయి కోసం విశ్వనాధంగారు కబురు చేశారు. రాతకోతలు పూర్తి అ య్యాయి. పైకం ముట్టినట్లు శాయి సంతకం పెట్టేశాడు. విశ్వనాధంగారు ఇరవై అయిదు వేలు శాయి చేతికి యిచ్చారు. శాయి ఆ నోట్ల కట్టలను మళ్ళీ ఆయనముందే ఉంచేసి బయ టికి నడిచాడు.

పార్వతమ్మగారు భర్తను ప్రాధేయపడు తూండటం, "నోరుమూసుకుని అవతలికివెళ్లు" అని విశ్వనాధంగారు కసరుకొనటం శాయికి వినిపించింది.

ఎక్కడికీ వెళ్ళవద్దన్న మామగారిమాట విన కుండా భార్యను, పిల్లవాణ్ణి తీసికొని వూరికి ప్రయాణమైనాడు.

ఊరికి వెళ్ళేముం దు విశ్వనాధంగారిం టికి వెళ్ళి "అమ్మా" అని పిలిచాడు. అతని గొంతు జీరపోయింది. ఆమె కన్నీరు కారుస్తోం ది. హృదయాల్లోని



ప్రేమావాత్సల్యాలను వ్యక్తపరచుకోవడానికి లేకుండా ఏదో కఠినశాసనం అమల్లో వున్నట్లు బాధపడ్డారు.

"ఊరికి వెళ్ళుతున్నాం అమ్మా" అన్నాడు.

ఆమె ఏమీ మాట్లాడలేకపోయింది. అతి కష్టంమీద "మంచిది నాయనా" అన్నది.

విశ్వనాధంగారి దగ్గరికి వెళ్ళాడు. గొంతు పెగల్లేదు. "నాన్నగారూ" అన్నాడు ప్రయత్న పూర్వకంగా, ఆనాడు కన్నతండ్రి కన్నీటితో కంపించటం జ్ఞాపకానికి వచ్చింది.

తను... ఎవరికి సంబంధించినట్లు? ఎవరికి సంబంధించినట్లు?

విశ్వనాధంగారే పూర్తిచేశారు - "మంచిది, వెళ్లిరండి."

శాయి తలవంచుకొని బయటికి నడిచాడు.

భార్యనూ, కొడుకునూ తీసికొని వూరికివెళ్ళి నౌకరీ చేసుకుంటూ, స్వంతకాపురం నిర్వహించుకుంటూ వెళ్ళుతున్నాడు. పురుషోత్తంగారు కూడా కుమార్తె సంసారాన్ని ఒకకంట కనిపెట్టే వున్నారు.

అతను చేస్తున్న ఆ చిన్న నౌకరీకి చిక్కులేమీ లేవు, కాని, అతని హృదయంలో వుండుండీ గుబులు పొర్లేది... విశ్వనాధంగారు తనను ఎందుకు దగ్గరికి తీసినట్లు? ఎందుకు వెళ్ళగొట్టినట్లు?

వాళ్ళు పెద్దవాళ్ళయ్యారు. తనవంటి వాడు కనిపెట్టుకొని వుండవలసిన సమయం. తాను మొండికిపడి ఆయనదగ్గరనుంచి రాకుండా వున్నట్టయితే బాగుండేదేమో! "ఛో" అని మెడ బట్టి నెట్టూవుంటే, చూరుపట్టుకొని వ్రేలాడటం మంచిది కాదేమో!

ఈ విధమైన ఆలోచనలతో బాధపడటం అతని మనస్సుకు అలవాటైపోయింది.

మనశ్శాంతి కోసం బిడ్డను దగ్గరకు పిలిచి అడిగేవాడు - "నాన్నమ్మదగ్గరికి పోదామా పాపా!"

"ఆ, పోదాం... 'కూ' బండెక్కిపోదాం. అమ్మతో చెప్పుతా" అని "కూ" అని కూస్తూ చక్రాల్లా చేతులు తిప్పుకుంటూ "జిగ్ జిగ్ జిగ్" అంటూ రైలులా ఆడుతూ తల్లి దగ్గరికి పోయేది.

అతని మనస్సుకెంతో శాంతి దొరికినట్లయ్యేది.

అలాగే కొన్ని నెలలు గడిచాయి. అతనికి పెంపుడు తల్లిదండ్రులను చూడాలనిపించి ప్రయాణమై వెళ్లాడు. ఏదో పనివుండి వచ్చానని చెప్పి ఒకరోజు వుండి బయలుదేరాడు.

వెళ్ళుతున్న శాయికి దొడ్డివాకిలి దగ్గర "శాయీ"అన్న పార్వతమ్మగారు నెమ్మదిగా పిలిచిన పిలుపు వినపడింది. ఆశ్చర్యంతో వెనక్కు చూసి, దగ్గరకెళ్ళి "ఎందుకమ్మా" అని అడిగాడు.

"వారి స్వభావం అలా మారిపోయింది. అయినా నీవు కనిపెట్టివుండకపోతే ఎలా తండ్రీ? నా ప్రాణం వుండేవరకు ఏదో వంక పెట్టుకొని వస్తూ పోతూ, అప్పుడప్పుడు పిల్లలను కళ్ళకు చూపిస్తూవుండు... నీవు నా కడుపున పుట్టావనే అనుకున్నాను" పైటచెంగుతో కళ్ళు అద్దుకుంది.

ఇంతలో విశ్వనాధంగారి పిలుపు వినిపించింది. ఆమె దుఃఖాన్ని మింగి "ఆఁ, వస్తున్నాను" అని పెద్దగా అని, శాయితో "పిలుస్తున్నా

డాల్ఫిన్‌లు ఒక కన్ను తెరిచి పడుకుంటాయి.




రు, పోతాను. దీనితో (పది రూపాయలు యిస్తూ) పిల్లల కేదైనా పట్టుకెళ్ళు, ఇవ్వాలన్నా నా దగ్గర ఏముంటుంది? నీకు తెలియందేముంది?" అని ప్రేమపూర్ణ నయనాలతో చూసి, లోపలికి వెళ్ళింది.

శాయి ఆశ్చర్యానికి అంతులేదు. విశ్వనాథంగారి చేతిలో అన్ని వేలు ఆడుతున్నా, ఆమెకు ఒక్క రూపాయికూడా కళ్ళతో చూసే ప్రాప్తంలేదు. అలాంటిది ఎలా మిగిల్చిందో!

తన వ్యక్తిత్వాన్ని, కోరికలను, సుఖాన్ని త్యాగంచేసి, అలాంటి భర్తతో సర్దుకుపోతోంది" వడ్లతో గంప ఎండిపోవలసిందేనన్నట్లు! భర్త మరీ అన్యాయంగా క్రూరంగా ప్రవర్తించినప్పుడు అస్పష్టంగా బాధపడుతూనో, కన్నీరు తుడుచుకుంటూనో దొడ్లోకో, వంటింట్లోకో వెళ్ళేది. ఎదురుమాట్లాడటం ఎప్పుడూ లేదు.

ఒక వేపు ప్రేమ, జాలీ లేని కేవలం డబ్బును చూచుకునే హృదయంలేని విశ్వనాథంగారు. రెండవవైపు డబ్బుముఖం ఎరుగని ప్రేమ, జాలి నిండిన హృదయంతో పార్వతమ్మగారు - కఠినశిల, తియ్యని నీటిచెలమ - ఒకరిని ఆశ్రయించి ఒకరు! - అని ఆశ్చర్యపడుతూనే త్వరత్వరగా నడిచి రైలును అందుకుని వూరికి చేరుకున్నాడు.

కొన్ని నెలలు గడిచాయి.

ఒకరోజు ఆ వూరివాడు కనిపించి పార్వతమ్మగారికి శరీరమంతా నీరు కనిపించిందని చెప్పాడు. అది వినగానే వూరికి బయలుదేరి వెళ్ళి తల్లి పరిస్థితిని చూశాడు.

"నా గతి యిలా అయింది నాయనా" అని కంటనీరు పెట్టుకొని, భర్తచేత ఉపచర్యలు చేయించుకొంటున్న తన పాపపు జీవితాన్ని నిందించుకొంది. కోడల్ని పంపమని కోరింది.

శాయి విశ్వనాథంగారి వేపు చూశాడు. ఆయనే అన్నిపనులూ చేసుకుంటూ వెళ్ళుతున్నాడు. వంటమనిషిని పెట్టడం, ఆమె మానుకోటం జరిగాయిట. ఒక్కనాడైనా అటు వస్తువు యిటు పెట్టి యెరుగని ఆయన యింత ఓపికను

ఎలా తెచ్చి పెట్టుకున్నాడో! ప్రతిపనిలోనూ తడబడటం, కాలికో చేతికో దెబ్బతాకటం జరుగుతోంది. స్వవిషయంలో శ్రద్ధ తీసుకోడానికి ఆయనకు సమయం ఏది?

తన మీద ఎందుకో ఆయనకా కక్ష? నిజానికది కక్షకాదు – లోభబుద్ధియొక్క పరిణామం – ఆ తత్వాన్ని యిక మార్చుకోవాలన్నా ఆయన మార్చుకోలేడు కాబోలు అనుకున్నాడు జాలిగా.

విశ్వనాథంగారి దగ్గరికెళ్ళి "మీ కోడల్ని పంపుతాను. అమ్మను కొంచెం జాగ్రత్తగా చూస్తుంది" అన్నాడు.

విశ్వనాథంగారు "నీ యిష్టం" అన్నారు.

శాయి ఊరికివెళ్ళి భార్యను పంపాడు. ఆమె తండ్రి యింట్లో దిగి పిల్లలను తన తల్లికి అప్పగించి అత్తగారి దగ్గరికి వెళ్ళింది.

రాత్రింబవళ్ళు పిలచినప్పుడల్లా సిద్ధంగా పలుకుతోంది. మలమూత్రాలని అసహ్యించుకోకుండా సేవచేస్తోంది. ఒళ్ళుతుడిచి, ఉతికిన బట్టలు తొడిగి, తలదువ్వి, వేళకు పథ్యపానాలు అందిస్తోంది అతిశ్రద్ధగా.

ఒకరోజు పార్వతమ్మగారు కోడలిని దగ్గరికి పిల్చి హృదయానికి హత్తుకుని కళ్ళనిండా నీళ్లు నింపుకొంది. కొడుకును భర్త వెళ్లిపొమ్మన్నందుకు ఎంతో కష్టపడుతున్నట్లు, ఆ విషయంలో తానేమీ చేయలేకపోయినందుకు బాధపడుతున్నట్లు ఆమె విషాద ముఖభంగిమ చెబుతోంది.

ఆ సమయంలో విశ్వనాథంగారు మంచి నీళ్ళకోసం లోపలికివచ్చి వాళ్ళ యిద్దరిని చూసి "ఏమిటి?" అన్నట్లు ఆశ్చర్యంతో భార్యవంక చూశారు.

"ఏమీలేదు, మన పెంపకం ఎంత నవ్వుబాట్ల వ్యవహారమయిందీ చివరకు!..." అని చాలా నీరసంగా దుఃఖం నిండిన కంఠంతో అన్నది.

"సిద్ధంగా కూర్చున్నవాళ్ళకు అన్నీ నవ్వుబాట్ల వ్యవహారాలుగానే ఉంటాయి."

"అలా కూర్చోనివాళ్ళకే యిది నవ్వుబాట వ్యవహారమయింది" అని గబగబా అనేసింది.

"ఏమిటీ ధోరణి?" కోపంగా అరిచారు విశ్వనాథంగారు.

"ఒంట్లో సరిగాలేని వారి మాటలకేంలెండి మామగారూ" అని సర్ది, "ఊరుకోండి అత్తయ్యా" అని బ్రతిమలాడింది సరళ.

"సరిగా లేనివాళ్లు కళ్ళు మూసుకొని పడుండాలికాని అధికప్రసంగం ఎందుకు?" అంటూ విసురుగా వెళ్ళాడు.

పార్వతమ్మగారి శరీరమంతా కంపించి, చెమటలు పోశాయి గుండెదడ, కళ్ళుతిరగటం తెలుసుకొని సరళ ఆమెను ప్రక్కమీద పడుకోబెట్టి నెమ్మదిగా విసిరింది.

బహుశా జీవితంలో యిదే ఆమె భర్తతో ఉద్రేకపడి వ్యతిరేకించి, భరించలేని స్థితిలో వాగ్వాదానికి దిగిన క్షణం.

శాయికి ఆయన అన్యాయం చేశారు. ఆ అన్యాయం శాయితో ఆగలేదు, తనకూ జరిగింది, ఆయనకూ జరిగింది తెలుసుకోలేదు గాని. ఆయనకు నచ్చచెప్పడం తనవల్ల కాదు గదా, బ్రహ్మతరంకూడా కాదు.

ఈ జబ్బు తనప్రాణం తీస్తుందని ఆమె ఎప్పుడో అనుకుంది. తనను ఆ స్థితిలో అసహ్యించుకోకుండా మలమూత్రాలలో పడి కుళ్ళిపోకుండా కాపాడేవాళ్ళు ఎవరు? సరళ వచ్చింది కాబట్టి సరిపోయింది. కన్నకడుపుకే చెయ్యా

టం అంతంత మాత్రం. అలాంటప్పుడు దగ్గరకు తీసినట్లు తీసి, కన్న తల్లిదండ్రులకు దూరంచేసి, చివరకు "నీ కర్మానికి నీవు పో" అన్నట్లు, గోవువంటి శాయిని వెళ్లగొట్టటం ఎంత సిగ్గుమాలిన పని? ఇలా తలచుకొన్న కొద్దీ అసలే వృద్ధురాలైన ఆమె హృదయం వ్యాధి చేత, యీ ఆందోళనచేత మరింత దుర్బలమై తట్టుకోలేకపోయింది.

జీవితమంతా విశ్వనాథంగారితో గడిపినా ఆమెకు భర్తహృదయం యింత వికృతంగా క్రూరంగా ఎన్నడూ కనిపించలేదు. ఆయన ప్రకృతిలోని మాలిన్యాన్ని నిర్లక్ష్యంగా ఉపేక్షించి సర్దుకుపోవడానికి తగ్గశక్తి ఆమెలో పూర్వం వున్నట్లుగా యిప్పుడు లేదు.

తన దీనస్థితిని చూడగానే వెన్నలా కరిగిపోయిన సరళను పంపిన శాయి! కడుపున పుట్టిన కొడుకుమాత్రం యింతకంటే చేయగలిగిందేముంది? ఏ మాత్రం అసహ్యించుకోకుండా కన్నబిడ్డకంటే ఎక్కువగా చేస్తున్నది సరళ!... ఇలా ఆలోచించినకొద్దీ వాళ్లమీద వాత్సల్యం పొర్లిపోయి వాళ్లకు జరిగిన అన్యాయం వేయిపడగలెత్తి ఆమె మనస్సులో ఆడసాగింది.

ఇంట్లో వాళ్లున్నంతకాలం యిల్లు కలకలలాడుతూ ఎంత సంతోషంగా ఉండిందో. శాయిని అలా తరిమి వుండకపోతే తన సంసారం నలుగురిలో ఎంత నిండుగా, గంభీరంగా వుండేది! ఈ వ్యాధి తనకు అసలు వచ్చేదా?

ఈ ఆలోచనల వొత్తిడి ఆమె రక్తంలో, హృదయచలనంలో, మెదడు మీద విపరీత పరిణామాలను తెచ్చింది. భర్త ఓదార్పు సానుభూతి లేకపోవడంవల్ల మరింత ప్రమాదపరిస్థితి ఏర్పడి అప్పుడప్పుడూ తెలివి తప్పిపోసాగింది. సంధి ప్రేలాపనలో శాయిని పిలిచేది. మాతృప్రేమను వొలికించేది. మనుమణ్ణి ముద్దులాడేది. జోలపాటలు పాడేది. ముచ్చట్లు ఏవేవో చెప్పేది.

డాక్టరు ఏమీ చేయలేకపోతున్నాడు. ఏ మందుకూ తగిన సమాధానం లేదు.

విశ్వనాథంగారు ప్రక్కనే వుండి, ఆమె సంధి ప్రేలాపన వింటూండేవారు. ఆయనను ఎన్నడూ ఎరుగని ఏదో పిరికితనం పట్టుకుంది. మిగిలివున్న తన జీవితం కళ్ళకు కట్టినట్లయ్యింది.

...ఆమె కళ్ళు మూస్తుంది. ఇంట్లో శాయీ పిల్లలూ వుండరు. భయంకర నిశ్శబ్దంలో తాను క్రూరమైన వృద్ధాప్యంతో కుస్తీపడుతూంటాడు. తను కూడబెట్టినధనం, నౌకరూ వుంటారు. అప్పుడు సుఖాన్నీ, విశ్రాంతినీ, శాంతినీ ఇచ్చే శక్తి ఆ ధనానికి ఎక్కడిది?...

ఇంతలో పార్వతమ్మగారికి తెలివి వచ్చి "శాయి వచ్చాడా అమ్మా?" అని అడిగింది.

"రాలేదు అత్తయ్యా"

"తపస్సుచేసి తెచ్చుకున్నాను. వెనుక జన్మలో చేసిన ఏ మహాపాపమో మళ్ళీ దూరంచేసింది" అని ఏడుస్తోంది.

డాక్టరు ఇంజక్షను ఇవ్వడానికి ప్రయత్నించాడు. పార్వతమ్మగారు డాక్టరువేపు – బ్రతికించాలని చేసే ప్రయత్నాన్ని అసహ్యించుకొంటున్నట్లు చూసి, చేతిని దగ్గరకు లాక్కుంది.

మళ్ళీ సంధివచ్చి వెక్కివెక్కి ఏడుస్తోంది.

విశ్వనాథంగారి కళ్ళలో నీళ్ళుతిరిగాయి. దిగులు, భయం చుట్టుముట్టాయి. ఆమె ప్రాణాన్ని తీస్తున్నది తానేనేమోనన్న సందేహం పట్టుకొంది.

ఆమెచూపు తప్పిపోతోంది. కోడలిచేతిని తడుముతూ "వచ్చాడా అమ్మా, అబ్బాయీ?" అంటోంది.

"రాలేదు" అనటానికి సరళకు భయం వేసింది.

విశ్వనాథంగారు కన్నీరు కారుస్తూ తడబడు తున్న అడుగులతో గదిలోకి వెళ్ళి చేతినిండా పైకం తీసుకొని వాకిట్లోకివచ్చి నిలబడి చూస్తు న్నారు, శాయి దగ్గరికి ఎవరినైనా పంపించాలని – ఎంత ఖర్చయినాసరే.

ఆకాశం నల్లని మేఘాలతో నిండివుంది. గాలి కసరుగావుంది. చెట్లకొమ్మలు విరిగి పడు తున్నాయి. కుండపోతగా వాన కురుస్తోంది. భయంకరమైన ఉరుములు, మెరుపులు, అప్పు డప్పుడూ పిడుగులు పడుతున్న చప్పుడు చెవుల్ని బ్రద్దలు చేస్తున్నాయి.

ప్రకృతి ఉగ్రచండికలా వుంది. ముఖం బయటపెట్టేలాలేదు. ఒక్క పురుగైనా బయట కనపడటంలేదు. తన డబ్బు ఇక ఎవరికి ఆశ కొలుపుతుంది?

ఆయన కళ్ళనుండి ధారలు ధారలుగా కన్నీ రు కారుతున్నాయి.

వర్షంలో భూమీ, ఆకాశం ఒకదానిలో ఒక టి కలిసిపోతున్నట్లుగా ఉన్నాయి. కొన్ని చెట్లు అటూ ఇటూ వూగి పక్కకు పడిపోతున్నాయి.

ఎవరో దూరంగా వస్తున్నట్లుంది?

అతన్ని గాలి అటూ ఇటూ విసరి పడగొడు తూ వుంది. పడుతూ లేస్తూ కాళ్లు నిలదొక్కు కుంటూ వస్తున్నాడు. ఒళ్లు విరగగొట్టినట్లు హూనం హూనం అయినట్లుంది. పాపం. ఎవరో?

చూపు ఆనడంకోసం విశ్వనాథంగారు కన్నీటిని తుడుచుకుంటూ చూస్తున్నారు.

ఒళ్ళంతా గాయాలతో, బురదతో తడిసి ముద్దయి గజగజా వణుకుతూ వస్తున్న అతను ఒక్కసారి మిగిలివున్న శక్తినంతనూ కూడగట్టు కొని గడపలోకి వచ్చిపడ్డాడు.

తొట్రుపాటుతో రెండూ చేతులూ చాచి అతన్ని చేతుల్లోకి తీసుకుని విశ్వనాథంగారు స్త్రీలా ఆర్ద్రకంఠంతో పెద్దగా పార్వతమ్మ గారి గదివేపు తిరిగి "వచ్చాడు, అబ్బాయి వచ్చాడు" అన్నారు.

ప్రాణం దిమ్మెరపోయిన శాయి దిబ్బడపడ్డ చెవులలోకి దీనంగా పార్వతమ్మగారి గొంతు అదేపనిగా అతినీరసంగా వినపడుతోంది – "ఏడీ అబ్బాయి? ఏడీ అబ్బాయి?" అని.

శాయి నెమ్మదిగా రెప్పలు విప్పి విశ్వనాథం గారి వేపు చూశాడు.

భీతిగ్రస్తంగా నిస్సహాయంగా అశ్రుపూరిత నయనాలతో చూస్తున్న ఆయన వదనంలోకి దయ, ప్రేమ, ఆశ ప్రవేశించి విద్యుత్కాంతిలా ఉజ్వలంగా ప్రకాశించ ప్రారంభించాయి.

తల్లి పాదాలపై వ్రాలటానికై శాయి లేచాడు తూలుతూ, సోలుతూ.

వాత్సల్యమూర్తి అయిన పార్వతమ్మగారి దగ్గరికి నడుస్తున్న శాయిని పడిపోకుండా పట్టు కొని నడుస్తున్నారు, హృదయంలో కోమల దయాభావం మేల్కొన్న విశ్వనాథంగారు.

బయట ఆకాశంలోని భయంకర కారు మబ్బులు ఒకదానికి ఒకటి దూరంగా జరిగి ప్రశాంత నక్షత్రాలను ప్రకాశించి క్రమక్రమంగా మాయమయ్యాయి. ●